



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

క్రీడా స్ఫూర్తిని పెంచేలా
'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం
కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా క్రీడ స్ఫూర్తిని పెంపొందించే విధంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, డిఆర్‌ఒ కొండయ్య, చీఫ్‌కోచ్ ఉదయ్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 2 నుంచి ప్రతిష్టాత్మకంగా సచివాలయాల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్రీడలు నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ఆడుదాం ఆంధ్ర కోసం మస్కట్ లోగోను ఉత్సాహం ఉన్నవారు ప్రతిపాదనలు పంపితే రాష్ట్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. అక్టోబర్ 2న మహాత్మా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా సచివాలయ, మండల స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలలో వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్ క్రీడలు నిర్వహించాలన్నారు. అక్టోబర్ 2 నుంచి 45 రోజులు పాటు వీటిని నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన వారికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారన్నారు. పోటీలు మహిళలు, పురుషులకు వేర్వేరుగా నిర్వహించాలన్నారు. దీనిపై అధికారులు విస్తత స్థాయిలో ప్రచారం నిర్వహించాలన్నారు. మొదటి, ద్వితీయ, తతీయ బహుమతులు 50 వేలు, 30, వేలు, 20, వేలు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు ఈనెల 10 లోగా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

9 నుంచి 20 వరకు నా భూమి నా దేశం కార్యక్రమం

జిల్లా వ్యాప్తంగా ఈనెల 9 నుంచి 20 వరకు నా భూమి, నా దేశం కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆజాదీకా అమత్ మహోత్సవంలో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలు మండల, పట్టణ కేంద్రాల్లో ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈనెల 10న పంచప్రాణ ప్రతిజ్ఞ చేసి 75 మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రామాంజనేయులు, సిపిఒ విజయ్ కుమార్, గహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను జెసిబిలతో తొలగిస్తున్న పోలీసులు



పేదల గూడును కూల్చేశారు...!

'నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తాం... దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లోపే ఇళ్ల పట్టాలను వారి వద్దకు చేరుస్తాం.. సొంతిళ్లు లేకుండా పేదలు ఎవరూ ఉండకూడదు'.. ఇవి నాయకుల నోటి నుంచి నిత్యం వచ్చే మాటలు. ఆచరణలో ఇందుకు భిన్నంగా పరిస్థితులు కన్పిస్తున్నాయి. దరఖాస్తు చేసుకుని సంవత్సరాలైనా పేదలకు ఇళ్ల పట్టాలు అందని పరిస్థితి పెనుకొండ పట్టణంలో నెలకొంది. దీంతో పేదలు సిపిఎం, వ్యకాసం, సిఐటియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గత నెల 24వ తేదీన భూస్వాధీన పోరాటం నిర్వహించారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని అందులో పట్టాలు ఇవ్వాలని కోరారు. ఇదేదో నేరం అయినట్లు అధికార యంత్రాంగం వారి మందీమార్బలంతో పేదలు వేసుకున్న గుడిసెలను జెసిబిలతో తొలగించేశారు. గుడిసెలు తొలగించొద్దంటూ పేదలు కన్నీళ్లు పెట్టుకుని ప్రాధేయపడినా కనికరం చూపకుండా అధికారులు వాటిని తొలగించేశారు.



సిపిఎం, వ్యకాసం నాయకుల అరెస్టును అడ్డుకున్న పేదలను లాగి పడేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ పట్టణంలో పేదలు ఇళ్ల స్థలాలు లేకుండా ఇప్పటికీ అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. ఇలాంటి వారందరూ పెనుకొండ పట్టణం మడకశిర రోడ్డులోని 668 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో గత నెల 24వ తేదీన గుడిసెలను వేసుకున్నారు. ఈ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అధికారులను కోరారు. ప్రభుత్వ స్థలంలో పేదలకు పట్టాలు ఇవ్వాల్సిన అధికారులు ఆ దిశగా ఆలోచించకుండా వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించడమే పనిగా పెట్టుకున్నారు. మంగళవారం వేకువజామున 6 గంటల సమయంలో తహశీల్దార్ స్వర్ణలత, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, పెనుకొండ సిఐ కరుణకర్‌తో పాటు రెవెన్యూ, నగర పంచాయతీ, పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున పేదల స్థలంలోకి వెళ్లారు. జెసిబిలు, లారీలను పిలిపించి గుడిసెలను తొలగించేశారు.

తహశీల్దార్, పోలీసు స్టేషన్ వద్ద ధర్నా

పేదలకు అండగా నిలిచిన సిపిఎం, వ్యకాసం, సిఐటియు నాయకులను వెంటనే విడుదల చేయాలంటూ తహశీల్దార్, పోలీసు స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హరి, నాయకులు హనుమయ్య, రమణ, బాబావలి తదితరులు మాట్లాడుతూ నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకం కింద నగర పంచాయతీ పరిధిలో ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం స్పందన కార్యక్రమంలో అనేక సార్లు దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకుని రసీదు పొందిన 90 రోజుల్లోపు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న అధికారుల మాట సంవత్సరాలు గడిచినా అమలుకాలేదన్నారు. సబ్‌కలెక్టర్, తహసీల్దార్లు ప్రభుత్వ భూమిని గుర్తించే పనిలో ఉన్నారంటూ నిత్యం వాయిదాలు వేస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గత్యంతరం లేక లబ్ధిదారులే ప్రభుత్వ భూమిని గుర్తించి సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చి భూస్వాధీన పోరాటం నిర్వహించారన్నారు. అందులో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అధికారులు స్పందించకపోగా, వేసుకున్న గుడిసెలను జెసిబిలతో తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రయివేటు వ్యక్తులు చేసినట్లుగా అధికారులు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. ప్రభుత్వ భూమిని గుర్తించి దరఖాస్తుదారులందరికీ పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పిన తహశీల్దార్ ప్రస్తుతం ప్రభుత్వ భూమే లేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. పేదలు గుడిసెలు వేసుకున్న భూమిని ఎవరికి కట్టబెట్టడానికి అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. గుడిసెలు వేసుకున్న స్థలాల్లో పేదలకు పట్టాలు ఇచ్చేంతవరకు ఆందోళన విరమించేది లేదన్నారు. అవసరమైతే న్యాయపోరాటం కూడా చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమి, కెవిపిఎస్ నాయకులు వెంకటేష్, చేనేత కార్మిక సంఘం నాయకులు శీలా నారాయణస్వామి, సిఐటియు నాయకులు బాబావలి, తిప్పన్న, కొండా వెంకటేష్, రంగప్ప, కిష్టప్ప, నరసింహమూర్తి, ఉత్తప్ప పాల్గొన్నారు.

- ◆ ప్రభుత్వ స్థలంలో వేసుకున్న గుడిసెల తొలగింపు
- ◆ జెసిబిలతో నానా హంగామా
- ◆ కన్నీళ్లతో వేడుకున్నా కనికరం చూపని అధికారులు
- ◆ సిపిఎం, వ్యకాసం, సిఐటియు నాయకుల అరెస్టు
- ◆ అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం
- ◆ పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన



పోలీసు స్టేషన్ వద్ద పేదలతో కలిసి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

సిపిఎం నాయకుల అరెస్టు.. అడ్డుకున్న పేదలు...

గుడిసెలను తొలగిస్తున్న విషయం తెలుసుకున్న పేదలు, సిపిఎం, వ్యకాసం, సిఐటియు, రైతుసంఘం నాయకులు అక్కడికి చేరుకున్నారు. జెసిబిలకు అడ్డుపడ్డారు. పోలీసులు వారిని బలవంతంగా అక్కడి నుంచి నెట్టివేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న , జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, నరసింహులును అరెస్ట్ చేసి చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాయకులు అందరినీ అరెస్టు చేసిన పోలీసులు అనంతరం పేదలు వేసుకున్న గుడిసెలను జెసిబిలతో కూల్చివేశారు.



గుడిసెలను కూల్చివేత వద్దంటూ జేతులు జోడించి వేడుకుంటున్న పేదలు

కన్నీళ్లు పెట్టుకున్నా కనికరం చూపలేదు..

'తాము పేదలం.. ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాల్సింది పోయి... వేసుకున్న గుడిసెలను తొలగించొద్దంటూ మహిళలు అధికారుల ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నారు. అయినా అధికారులు కనికరం చూపలేదు. ఈ సందర్భంగా పేదలు మాట్లాడుతూ సొంత ఇళ్లు లేక ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నామన్నారు. రోజు కూలి పనులు చేసుకునే తాము ఇంటి బాడుగలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే తొలగించడం అన్యాయంగా ఉందన్నారు. అధికారులకు, రాజకీయ నాయకులకు పేదలపై కనికరం లేదంటూ కన్నీటి పర్యవంతం అయ్యారు. పట్టణంలో అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కోట్లాది రూపాయల విలువైన స్థలాలను కబ్జా చేస్తున్నా పట్టించుకోని అధికారులు పేదలు సెంటు స్థలం ఇవ్వమంటే ఇలా వ్యవహరించడం ఏమిటంటూ ఆక్రోశం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు

పేదలను స్థలం నుంచి ఖాళీ చేయించిన అధికారులు ఆఘమేఘాల మీద ఆ స్థలంలో బోర్డు ఏర్పాటు చేశారు. మడకశిర రోడ్డులోని సర్వే నెంబర్లు 668–1, 668–3, 668–5, 668–7, 668–8, 668–9, 668–13 సర్వేనెంబర్లలోని భూమి ప్రభుత్వ భూమి అని తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూమిని దురాక్రమణ చేసినవారు ఐపీసీ సెక్షన్ 447 మేరకు శిక్షార్హులు అన్నట్లు తహశీల్దార్ పేరుపై బోర్డును ఉంచారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరిన స్థలం ఇలా బోర్డులు ఏర్పాటు చేయడం ఏమిటంటూ పలువురు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎఐఎల్‌యు జిల్లా ఉపాధ్యక్షులుగా ఇ.ప్రసాద్

ప్రజాశక్తి ధర్మారం టౌన్

ఈనెల 6న అనంతపురం విజయనగర లా కళాశాలలో జరిగిన ఆలిండియా లాయర్స్ యూనియన్ రెండవ జిల్లా మహాసభలలో (ఎఐఎల్ యు)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాస్ రావు గారి ఆధ్వర్యంలో నూతన అనంతపురం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నూతన ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షులు ఇడపాబత్తిని ప్రసాద్ మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు, న్యాయశాస్త్ర బోధకులు సమ్మిళిత సంస్థ భారత రాజ్యాంగం మూల విలువలు, లక్ష్యాలు కాపాడుకోవడమే. ప్రధాన లక్ష్యంగా యూనియన్ పనిచేస్తుందన్నారు.

9న కలెక్టరేట్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 9న కలెక్టరేట్ లో ఉదయం 9:30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఇందులో ప్రత్యేక ఆహ్వానితులుగా గిరిజన నాయకులు పాల్గొంటారన్నారు. వారి ప్రసంగాల అనంతరం గిరిజన నాయకులను సన్మానిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, గిరిజనులు, ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అందులో కోరారు.

వార్డు మెంబర్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని తంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డు మెంబర్(బీసీ మహిళ) ఉప ఎన్నికకు రిటర్నింగ్ అధికారి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోరిటర్నింగ్ అధికారి దివాకర్ మాట్లాడుతూ మంగళవారం నుంచి గురువారం సాయంత్రం వరకు నామినేషన్లు స్వీకరించబడతాయన్నారు. 11న నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. ఆగస్టు 14 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు గడువు ఉంటుందన్నారు. 14వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. ఎన్నిక అవసరం అయితే ఆగస్టు 19వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఆదేరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభిచి ఫలితం వెలువరిస్తామని చెప్పారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం



అర్ధనగ్నంగా ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న విఆర్‌ఎలు, నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్ హెచ్చరించారు. వీఆర్ఏల సమస్యలపై రెండవ రోజు మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు జరిగిన నిరసన కార్యక్రమంలో నాయకులు, విఆర్‌ఎలు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. అర్ధనగ్నంగా ఒంటి కాలిపై నిలబడి జగనన్నకు దండాలు పెడుతూ నిరసనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ విఆర్‌ఎలకు వేతనం ఒక్క రూపాయి కూడా పెంచకపోగా వున్న డిఎకు కూడా కోత విధించింది. డిఎ రికవరీ ఆపాలని ఎన్ని సార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఏ మాత్రం కనికరించలేదన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా విఆర్‌ఎ సమస్యలను పరిష్కరించాలని అనేక సార్లు అధికారులకు ప్రభుత్వ పెద్దలకు విన్నవించినా పట్టించుకోకపోలేదని వాపోయారు. ఇప్పటికైనా విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందింకపోతే ఈనెల 25న జగనన్నకు నేరుగా చెబుదాం అనే నినాదంతో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి ప్రసాద్, నాయకులు పెద్దన్న, నరసింహులు, నరసప్ప. పద్మావతి, లక్ష్మీదేవి, సంధ్య నారాయణమ్మతో పాటు విఆర్‌ఎల సంఘం నాయకులు, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మూగజీవాల అక్రమ రవాణా



వాహనంలో కబేళాలకు తరలుతున్న పశువులు

ప్రజాశక్తి మడకశిర

మూగ ప్రాణాలను రక్షించాలని అధికారులు ప్రజాప్రతినిధులు పలు సందర్భాల్లో సూచిస్తుంటారు. అయితే ఈ విషయంలో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. నియోజకవర్గంలో ప్రతిరోజు

పట్టించుకోని అధికారులు

వందలాది మూగజీవాలు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. కర్నాటక నుంచి ఆంధ్రలోని కబేళాలకు మూగజీవాలు తరలివస్తున్నాయి. ఆ జీవాలకు ఎలాంటి రక్షణ లేకపోవడం శోచనీయం. మంగళవారం కర్నాటక ప్రాంతం నుండి ఆంధ్రలోని గోరంట్ల, లేపాక్షి తదితర ప్రాంతాలకు మూగజీవాలు అధిక సంఖ్యలో తరలివచ్చాయి. చెక్‌పోస్టు అధికారులు కాని, స్థానిక అధికారులు గాని పట్టించుకోవటం లేదు. వారికి ముడుపులు అందు తుండటంతో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పుష్టిగా ఉండే ఆవులను కూడా కబేళాలకు తరలించి సొమ్ము చేసకుంటున్న చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. మంగళవారం మధుగిరి ప్రాంతం నుండి నేరుగా గోరంట్ల సంతకు వెళుతున్న పశువులను ఎవరూ పట్టించుకోలేదు. నంబర్లు లేని వాహనాలలో పశువులను తరలిస్తున్నా సంబంధిత ఆర్టీవో అధికారులు అలాంటి వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

కుంచిటిగ వక్కలిగలను ఒబిసిలో చేర్పించడానికి కృషి

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గంలోని కుంచిటిగ వక్కలిగలను ఓబీసీలో చేర్పించడానికి తమ వంతుగా కృషి చేస్తానని అఖిలభారత కుంచిటిగ మహామండలి రాష్ట్ర అధ్యక్షులు రంగ హనుమయ్య తెలిపారు. పట్టణంలోని బెగార్లపల్లి సమీపంలో నిర్మిస్తున్న కుంచిటిగ వక్కలిగా సముదాయ భవనాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని ముఖ్య వక్కలిగ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రంగ హనుమయ్య మాట్లాడుతూ కర్నాటక, తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రంలో కుంచిటిగ వక్కలిగలు ఎక్కువగా ఉన్నారని వారందరినీ ఓబీసీ లో చేర్పించాలని తమ వంతుగా పోరాటం చేస్తామని చెప్పారు. మూడు రాష్ట్రాల్లో ఉన్న వక్కలిగలు ఏకమై కేంద్రంతో పోరాడితే తప్పక విజయం సాధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా సంఘం అధ్యక్షులు అనంతరాజు, దీన్నే హట్టి నాగరాజు, హెచ్‌డి హనుమంతే గౌడు, రంగాపురం లక్ష్మీనారాయణ, జక్కయ్యపల్లి లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ రంగనాథ్, నరసింహారెడ్డి, నియోజకవర్గంలోని ముఖ్య వక్కలిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



వక్కలిగ నాయకులతో రాష్ట్ర అధ్యక్షులు రంగ హనుమయ్య

పకడ్బందీగా ఓటర్ల జాబితా పరిశీలన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎన్నికల ప్రధాన అధికారి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో పట్టణంలో, బూత్ స్థాయి అధికారులతో ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో భాగ్యరేఖ సూచించారు. ఆమె మంగళవారం తన కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో బూత్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ కె.వి మధుసూదన్ రెడ్డి, డివిజనల్ పరిపాలన అధికారి జిలాని, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, హరికృష్ణ, రహిమాన్‌తో పాటు సిపిఎం గంగాధర్, టిడిపి విజయకుమార్, వైసీపీ రంగారెడ్డి, బీఎస్పీ రాయుడు, సిపిఐ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డబల్ ఎంట్రీ ఓటర్లు చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారికి, నిబంధన మేరకు తొలగిస్తున్నట్లు చెప్పారు. ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష

కదిరి అర్బన్ : జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9 న జాతీయ లోక్ అదాలత్ నిర్వస్తున్నట్టు చైర్మన్ మండల న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ జడ్జి జయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణ న్యాయస్థాన ఆవరణంలో న్యాయవాదులు,పోలీసులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.. సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను దిగ్విజయం చేయాలన్నారు.

బాలికల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి, కదిరి టౌన్

కదిరి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో కదిరి రీజియన్ నల్లచెరువు ఏరియా పాఠశాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్మిత ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. 100 , 200, 400 మీటర్ల రిలే, షాట్ పుట్, లాంగ్ జంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో వివిధ పాఠశాలల నుండి దాదాపు 120 మంది క్రీడాకారిణిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీ శాంతమ్మ, ఎటిఎల్ సుకన్య, పీడీ, పిఇటిలు నరసింహాచారి, రెడ్డప్ప, షఫీ, విజయ్ నాయక్, హరినాథ్ రెడ్డి, సంధ్యారాణి, సుజాత, రాధమ్మ, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థినులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఆర్డీటీ ధర్మవరం డివిజన్ వారు నిర్వహించిన అథెటిక్స్ పోటీలలో, పట్టణంలోని కొత్తపేటలో గల మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మేరీ వర కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం మాట్లాడుతూ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనపర్చి ధర్మవరానికి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ప్రతిభా విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఇన్‌ఛార్జి హెచ్ఎం శారద, పిఇటి అశ్విని, పాఠశాల ఉపాధ్యాయులు రాము, ఆదినారాయణ, తదితరులు అభినందించారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

కలెక్టర్ అరుణ్‌బాబు


జగనన్న కాలనీ వసతులను పరిశీలిస్తున్న కలెక్టర్


మధ్యాహ్నభోజన పథకం అమలు తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి గోరంట్లరూరల్

జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం గోరంట్ల మండలంలోని గుమ్మయగారిపల్లి వద్ద గల మల్లాపల్లి జగనన్న కాలనీ లో ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. నెలాఖరులోపు రోడ్లు, డ్రైనేజీలతోపాటు నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించాలని అధికారులను సూచించారు. అలాగే మల్లాపల్లి గ్రామ సచివాలయ భవనం వైయస్సార్ హెల్త్ క్లినిక్ ల నిర్మాణాలు వారంలోపు పూర్తి చేయాలని, వెంటనే వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ చంద్రమౌళి, తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్, రైతు విభాగం అధ్యక్షులు పాటూరి శంకర్ రెడ్డి, జెడ్పీటీసీ పాలే జయరామ్ నాయక్, ఎంపీపీ ప్రమీల మూర్తి, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, సర్పంచ్ శివానంద, జడ్పీ కో ఆప్షన్ డాక్టర్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

సోమందేపల్లి : సచివాలయ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మండల పరిధిలోని గుడిపల్లి, తుంగోడు, మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. గుడిపల్లి సచివాలయ పరిధిలో జరుగుతున్న సచివాలయం, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలను పరిశీలించారు, తొందరగా నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించాడు. అనంతరం తుంగోడు గ్రామంలో నూతనంగా నిర్వహిస్తున్న సచివాలయం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా భవనాలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. నూతన అడ్మిషన్లు, గతంలో ఉన్న అడ్మిషన్ల గురించి ప్రధాన ఉపాధ్యాయులు ఖాదరవలిని అడిగి తెలుసుకున్నారు. అడ్మిషన్లు పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు, పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను తొందరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, తహశీల్దార్ సురేష్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఈవోఆర్డీ నాగరాజురావ్, ఎంఇఒ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఎంఇఒ ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో పలు రికార్డులను పరిశీలించారు. ఎమెనూ ప్రకారం చేస్తున్న వాటిలో నాణ్యత మెరుగుపరుచుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

రొళ్ల : రోళ్ల మండలంలోని ఆయా గ్రామపంచాయతీల పరిధిలో జాద్ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మొకకలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అధికారులకు కేటాయించిన గ్రామ పంచాయతీల పరిధిలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామంలో అనువైన ప్రదేశాల్లో కనీసం వంద మొక్కలు నాటాలన్నది ధ్యేయంగా పెట్టుకున్నట్లు వివరించారు.

నాణ్యమైన విద్యను అందించాలి

రొళ్ల : విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని ఎంఇఒ 1 మోహన్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రత్నగిరి, గొల్లహట్టి ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో విద్యార్థులు హాజరు పట్టిక పరిశీలించారు. మెను ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా ఇస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

పాడి రైతులకు అవగాహన

కొత్తచెరువు : పాడి ఆవులు, గేదెలు పెంచుకునే రైతులు తగిన మెలుకువలు పాటించాలని పశు సంవర్ధక శాఖ ఏడి పాటిల్ మల్లేష్ గౌడ్ తెలిపారు మండల పరిధిలోని మైలేపల్లి గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి ఆవులు గేదెలు పెంచుకునే రైతులకు ఆర్డీటీ రుణాలు మంజూరు చేస్తుందన్నారు. పశువులు వ్యాధులకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఎటిల్ సుధాకర్, మహిళా రైతులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

మడకశిర : పట్టణంలో ఆరేపేటకు చెందిన వాలంటీ మంజునాథ్ సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి వాలంటీర్ మంజునాథ్ కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్, ఉమాశంకర్, కట్ట కిషోర్, తిమ్మరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో రైతులకు మొక్కజొన్న విత్తనాలివ్వాలి

ప్రజాశక్తి గోరంట్ల

రైతులకు అవసరమైన మొక్కజొన్న విత్తనాలను ఆయా ఆర్‌బికెల్లో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాపురం ఎంపీటీసీ సుగుణమ్మ మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు మొక్కజొన్న పంట సాగుకు ఆయా ఆర్‌బికెల్లో ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు అందజేయాలని కోరారు. బూదిలి ఎంపీటీసీ మంజునాథ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ ఇప్పటికీ రైతుల ఖాతాల్లోకి పడడం లేదని రైతులకు ఇన్సూరెన్స్ వచ్చే విధంగా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎఒ మునికృష్ణ మాట్లాడుతూ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ వేయడానికి అదును దాటిపోయిందని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. ది కాబట్టి రైతులు మాయ పంటలు సాగు చేయడానికి ఉలవల తహశీల్దార్ రంగనాయకులు మాట్లాడుతూ మండలం మీదుగా గ్రీన్ ఫీల్డ్ హైవే భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం చెల్లించినట్లు చెప్పారు. అలాగే కదిరి నుండి హిందూపురానికి వెళ్లే నాలుగు లైన్ల రహదారికి భూసేకరణ జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఆయాగ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఈసమావేశంలో జెడ్పీటీసీ జయరాం నాయక్, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, మండల అగ్రి చైర్మన్ రామకృష్ణారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీవో రఘునాథ్ గుప్తాతో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'కందికుంట' ఇంట అభిమానుల సందడి

ప్రజాశక్తి - కదిరి టౌన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఇటీవల కదిరి పర్యటన సందర్భంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కందికుంట వెంకటప్రసాద్ ని ప్రకటించిన నేపథ్యంలో పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కదిరి ఇమాం ,మౌజిన్ కమిటీ ఆధ్వర్యంలో కదిరి ప్రభుత్వ ఖాజీ అన్సర్ బాషా ఆధ్వర్యంలో ఇమామ్‌లు మొజాన్లు మంగళవారం కందికుంట నివాసానికి చేరుకొని కందికుంటకు తమ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్ అర్షద్, దుగునేపల్లి అలీ, షాజహాన్ ,హాఫిజ్ ముబారక్, హాఫిజ్ అహమ్మద్, ఇమాం సాబ్ , ఖాజావలి,మహమ్మద్ షారుఖ్, కె పీర సాబ్, రహమతుల్లాహ్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తనకల్లు మండలం ఇమాం మౌజిన్ కమిటీ అధ్యక్షులు అలీ ఆధ్వర్యంలో షాజహాన్ ,ఇమాం సాబ్ ,ఖాజావలి మహమ్మద్ షారుఖ్, కె పీర సాబ్, రహమతుల్లాహ్, జియా కందికుంటను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


కందికుంటకు శుభాకాంక్షలు చెబుతున్న మైనార్టీ నాయకులు

మండలమీట్‌లో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి- చిలమత్తూరు

చిలమత్తూరు మండల అభివద్ధి కార్యాలయంలో ఎంపిపి పురుషోత్తమ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలను ఏకరువు పెట్టారు. పలగలపల్లి సర్పంచి వీధి దీపాల సమస్యను వివరించారు. వీరాపురం సర్పంచి లక్ష్మీ పతి రెడ్డీ వీరాపురం పశువుల ఆసుపత్రి లో రెగ్యులర్ వైద్యుడిని నియమించాలని కోరారు. దేమకేతేపల్లి సర్పంచి ఈడిగ తిరుమలేష్ తమ్మినాయనపల్లి రోడ్డు, యగ్నిశెట్టిపల్లిలో కల్వర్ట్,ఆర్యవైశ్యులకి శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని,అప్రకటిత విద్యుత్ కోతలు ఆపాలని కోరారు. ఇలా పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు తమ గ్రామాల పరిధిలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ నరేష్‌క్రిష్ణ, తహశీల్దార్ నాగరాజుతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

నంబుల పూలకుంట : ఎంపీపీ ఈటె రాము ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు తమ గ్రామాల పరిధిలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ల పనితీరు సరిగ్గా లేదని పలువురు సభ్యులు ఫిర్యాదు చేశారు. జగనన్న లేఅవుట్లలో అనర్హులకు పట్టాలు ఇచ్చారని అర్హులకు న్యాయం చేయాలని సింగిల్ విండో అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని కర్నాటక నాగేపల్లి 9వ వార్డు, పెద్ద కమ్మవారిపల్లిలో 20 వార్డులలో పట్టణ పార్టీ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టే సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గూడూరు ఓబులేసు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షురాలు యశోద, తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య, జిల్లా నాయకురాళ్లు మాధవి, రాధమ్మ, కౌన్సిలర్ రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

బోగస్ ఓట్ల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రతి ఒక్కరికి ఓటర్ కార్డ్ గుర్తింపు కార్డు ఇచ్చి బోగస్ ఓట్లు లేకుండా గట్టి చర్యలు చేపడతామని ఆర్డీవో తిప్పే నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీవోకార్యాలయంలో ఎన్నికల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటా ఓటర్ సర్వే కార్యక్రమంపై సమీక్ష తోపాటు ప్రగతి వివరాలను రాజకీయ పార్టీ నాయకులకు ఆర్డీవో వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎన్నికల ఉప తహశీల్దార్ అనిల్ కుమార్ రెడ్డి, సిబ్బంది రాజకుమార్, బిజెపి, టిడిపి, సిపిఎం, వైసిపి ప్రతినిధులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని రాట్నాలపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు రామప్ప కుమారుడు సుధాకర్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ స్పందించారు. మృతుని కుటుంబానికి రూ. 10వేలను నల్లచెరువు టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు, మాజీ వైస్ ఎంపీపీ రామ్‌మోహన్, చేతుల మీదుగా మంగళవారం అందజేశారు.

టిడిపి నాయకుల అరెస్టులు అక్రమం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పుంగనూరు, అంగళ్లు ఘటనలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల అరెస్టు అక్రమమని సత్యసాయి జిల్లా వడ్డెర సాధికార సమితి కన్వీనర్ పల్లపు రవీంద్ర అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒకప్రకటన విడుదల చేశారు. రాక్షస పాలనకు అంతిమ రోజులు దగ్గరపడ్డాయన్నారు. పుంగనూరులో ఘటనలో గాయపడిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు పొందుతుంటే దాడి చేసిన వైసీపీ గుండాలను వదిలేసి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. అన్నమయ్య జిల్లా వడ్డెర సాధికార సమితి కన్వీనర్ దేరంగుల నారాయణ అంగళ్లు ఘటనలో ప్రత్యక్షంగా లేకపోయినా ఆయనను పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి

ఇష్టపడి చదివితే ఉత్తమ భవిష్యత్తు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తమ భవిష్యత్తుఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటి చైర్మన్ బండి వేణుగోపాల్ సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం కళాశాల నుండి బదిలీ అయిన అధ్యాపకులను,బదిలీపై కళాశాలకు వచ్చి అధ్యాపకులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటరు వెరిఫికేషన్‌పై తహశీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి ముదిగుబ్బ

మండలంలో ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతున్న జాప్యంపై స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో తహశీల్దార్ నాగేంద్రకు ఫిర్యాదు చేశారు. మండలం లో ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదన్నారు. 61 బూత్‌లలో చాలాచోట్ల బిఎల్‌ఒలు వెరిఫికేషన్ మెదలు పెట్టలేదని విమర్శించారు. ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన గడువు ఇంకా 12 రోజులు గడువు మాత్రమే మిగిలివుందని గుర్తు చేశారు. సర్వర్ పనిచేయడం లేదని, ఆఫీస్ వర్క్ వుందని, సాకులు చెబుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, నారాయణస్వామి, రియాజ్, అశోక్, నంద తదితరులు పాల్గొన్నారు.

అద్దె లీజుపై అవగాహన

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి బస్టాండులో ఖాళీ స్థలాలు, వ్యాపారానికి అనువైన దుకాణాల అద్దె లీజు పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మైనుద్దిన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ టీ, కాఫీ, టిఫిన్, మెన్స్ బ్యూటి పార్లర్, ఆఫీసు, మిల్ డైరీ, కూల్ డ్రింక్స్, మొబైల్స్ షాప్, బేకరీ, కంప్యూటర్ షాపు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్, ఐరన్, వుడ్ షాపు తదితర షాపులు 13 వరకు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి నిర్వహణకు ఔత్సాహికులకు ఈనెల 10న డిపోమేనేజరు కార్యాలయం లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేరాలు ఘోరాలు

ఆటో డ్రైవర్ దారుణ హత్య

లేపాక్షి మండలం పరిధిలోని పులిమితి పంచాయతీలో గల స్థానిక లయోలా స్కూల్ వెనుక భాగాన ఆటోడ్రైవర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో ని బోయపేట కి చెందిన బాషా (60) ఆటో డ్రైవర్ గా పనిచేసుకొంటూ భార్య ఒక కూతురు కలిసి జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఆటో బాడుగకు వెళిన బాషా సాయంత్రమైనా ఇంటికి రాకపోవటంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై పలుచోట్ల వెతికారు. ఈ నేపథ్యంలో బాషా మృతదేహం స్థానిక లయోలా పాఠశాల వెనుక ఉండటాన్ని గమనించిన స్థానికులు సమాచారమందించారు. గుర్తు తెలియని వారు హిందూపురం నుండి బాడుగకు తీసుకొని వచిచ హత్య చేసి ఆటో తీసుకొని వెళ్లి ఉండవచ్చు అని స్థానికులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడు దుర్మరణం

బుక్కపట్నం : విద్యుత్ షాక్‌తో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరసింహుడు తెలిపిన వివరాలు... తెలంగాణ రాష్ట్రంలోని నారాయణపేట జిల్లా ఉట్కూరి మండలం, నిడుగుర్తి గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి భవన నిర్మాణ కార్మిక పనులు చేస్తూ జీవనం సాగిస్తూన్నాడు. పనులు ఎక్కడుంటే అక్కడికి తన సోదరుడు బంధువులైన చెన్నయ్య, సత్తి. బంగారం, రమేష్ లతో కలిసి పనులు చేస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో పది రోజుల నుంచి మండల పరిధిలోని కొత్తకోట గ్రామానికి చెందిన కేశప్ప అనే వ్యక్తి ఇంటి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం భవనం పైన పనులు చేస్తుండగా ప్రమాదవశాస్తూ కాలుజారి కింద పడిపోతున్న సమయంలో చేతిలో ఉన్న ఇడుపు కడ్డీ పట్టుకుని నిలదొక్కుకున్నాడు. అయితే ఆ ఇనుప కడ్డీకి విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై కిందికి పడిపోయాడు.గమనించిన బంధువులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని భార్య లక్ష్మి మంగళవారం ఉదయం చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు..

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

హిందూపురం: హిందూపురం పట్టణంలోని కొట్నూరు చెరువులో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహం బయటపడింది. మృతిచెందిన వ్యక్తి పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఫయాజ్‌గా స్థానికులు గుర్తించారు. చేపల వేటకు కోసం వెళ్లి మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వరుస చోరీలు

కొత్తచెరువు రూరల్ : మండల పరిధిలో వ్యవసాయ పొలాల్లో వరుస చోరీలు చోటు చేసుకోవడంతో మండలంలోని రైతులు బెంబేలెత్తుతున్నారు. మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి మార్గంలో రైతు రమేష్ కు చెందిన వ్యవసాయ పొలంలో సేద్యపు సామాగ్రి, నీటి ట్యాంకు, ఇతర వ్యవసాయ పరికరాలు సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. అంతకు మునుపటి రోజు అదే గ్రామానికి చెందిన ప్రసాద్, రాజప్పకు చెందిన డ్రిప్పు, స్పింక్లర్ల పైపులను దుండగులు ఎత్తుకెళ్లారు. అంతేకాక విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం చేయడం, అందులోని కాపరు వైరు దొంగలించడం, వ్యవసాయ పంపుసెట్ల మోటర్లకు అమర్చిన సర్వీస్ వైరును దొంగలించడం, తదితర దొంగతనాలు రోజురోజుకు అధికమవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తాము లక్షలాది రూపాయలు నష్టపోతున్నామని వాపోతున్నారు. పోలీసులు నిఘా పెంచి చోరీలను అరికట్టాలని వారు కోరుతున్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సోమందేపల్లి : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యేశంకరనారాయణ పేర్కొన్నారు.మండల కేంద్రంలోని నాలుగవ సచివాలయ పరిధిలోని స్నేహలత నగర్ ద్వారకామయి నగర్ లో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని ప్రజలతో అడిగి తెలుసుకున్నాడు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలు గ్రామంలో రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ చాలా అస్తవ్యస్తంగా ఉందని వీటిని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కి తెలియజేశారు. త్వరలో డ్రైనేజీ రోడ్డు నిర్మాణం చేపడతామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ నారాయణరెడ్డి, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, ఉప సర్పంచి వేణు, అధికారులు ,సచివాలయ ఉద్యోగులు, సర్పంచులు ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎనుములపల్లిలో మొహరం వేడుకలు

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో మోహరం వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. పీర్ల చావిడి వద్ద కొలువైన పీర్లను మంగళవారం జల్దీకి తీసుకెళ్లారు. స్నేహానికి పవిత్రతకు చిహ్నంగా జరిగే ఈ వేడుకలు వైభవంగా జరిగాయి. అనంతరం పీర్లను జల్దికి తీసుకెళ్లారు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఓటరు జాబితా పరిశీలన

రొద్దం : మండల వ్యాప్తంగా ఓటరుజాబితా పరిశీలన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వీఆర్వో బాబా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీనాయకులు,ఎం కొత్తపల్లి సర్పంచి కుమారుడు నాగరాజు, వీరన్న, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో నూతనంగా 30 మందివరకు నూతన ఓటర్లను చేర్పించినట్లు నాయకులు తెలిపారు.

వృద్ధురాలికి సాయం

ధర్మవరం టౌన్ : ధర్మవరంలోని వృద్ధురాలిపై అధికార పార్టీనాయకులు కక్షసాధింపుతో ప్రతినెల వస్తున్న పింఛనును తొలగించడంతో ఆ వృద్ధురాలికి తనవంతుగా ప్రతి నెలా పింఛను సొంత నిధులతో ఇస్తున్నట్లు జనసేనపార్టీ రాష్ట్రప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆ వృద్ధురాలికి పింఛన్ వచ్చేదాకా ప్రతినెలా తాను పింఛను సొమ్ము అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు వృద్ధురాలు సాలమ్మను మంగళవారం తన పార్టీ కార్యాలయానికి పిలుపించుకుని రూ.3వేలను అందజేశారు. ఈసందర్భంగా వృద్ధురాలు మాట్లాడుతూ పింఛను ఇవ్వాలని కోరితే తన భర్త చనిపోయిన డెత్ సర్టిఫికెట్ ఇవ్వాలని వాలంటీర్ చెప్పిందన్నారు. అయితే తన భర్త చనిపోయి 50సంవత్సరాలు అవుతోందని, ఇప్పుడు ఆ సర్టిఫికెట్ ఎక్కడి నుంచి తీసుకురావాలని వాపోయింది.


వృద్ధురాలికి సాయం అందజేస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి